75 మందికి గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి

సంగారెడ్డి అర్బన్, జూన్ 13 : జడ్పీ యాజమాన్య పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లకు గురువారం గెజిటెడ్ హెచ్ఎం(గ్రేడ్-2)గా పదోన్నతి ఉత్తర్వులు వెలువడ్డాయి. సంగారెడ్డి జిల్లాలో 75 మంది గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందారు. 61 మందికి ఈ జిల్లాలోనే పదోన్నతి దక్కగా, మేడ్చల్ జిల్లాకు ముగ్గురు, రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు, సూర్యాపేట జిల్లాకు ఒకరు, యాదాద్రి జిల్లాకు ఒకరు బదిలీ అయ్యారు. స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితా సిద్ధం చేస్తున్నారు. నేడు అభ్యంతరాలు స్వీకరించనున్నారు.



సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్‌లో నేలకూలిన విద్యుత్ స్తంభం



సుల్తానాబాద్‌లో కూలిన చెట్టు, ఎగిరిపోయిన రేకులు



శివ్వంపేట మండలంలోని లింగోజిగూడలో ధ్వంసమైన కోళ్లఫాం, గేదెల షెడ్డు

గాలివాన బీభత్సం

నారాయణఖేడ్/కల్హేర్/శివ్వంపేట, జూన్ 13 : నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షం బీభత్సం సృష్టించాయి. పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. సిర్గాపూర్ మండలం కడ్పల్‌లో విద్యుత్ స్తంభం విరిగి పడింది. సుల్తానాబాద్‌లో చెట్టు నేలకొరిగింది, రేకులషెడ్డు ఎగిరిపోయాయి. నారాయణఖేడ్, పిట్లం రహదారిపై విద్యుత్ స్తంభం, చెట్టు పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. సిర్గాపూర్‌లో 52.6 మి.మీ.లు, నాగల్‌గిద్దలో 49.6 మి.మీ.లు, కంగ్టిలో 8.4 మి.మీ.లు, మనూరులో 2.4 మి.మీ.లు, నిజాంపేటలో 1.5, ఖేడ్‌లో 1.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ట్రాన్స్‌కో సిబ్బంది యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరిస్తున్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం లింగోజిగూడలో ఈదురుగాలులకు రైతు దొంతి మల్లేష్ పౌల్ట్రీఫామ్ కుప్పకూలింది. గేదెల షెడ్డు ఎగిరిపోయింది. రూ. 15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు.

విత్తన సబ్సిడీకి మంగళం!

రాయితీ ఎత్తివేసిన ప్రభుత్వం

రైతులకు ఆర్థిక భారం

మెదక్, జూన్ 13: నాలుగు సంవత్సరాలుగా సర్కారు విత్తనాలపై సబ్సిడీని ఇవ్వడం లేదు. అంతకుముందు రాష్ట్రంలో వరి, జొన్న, మక్క, సజ్జ, నూనె గింజలు వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, సోయా, పప్పు ధాన్యాలు పెసర, మినుము, కంది విత్తనాల కొనుగోలులో 33 శాతం సబ్సిడీని ప్రభుత్వం ఇచ్చేది. 2020 నుంచి ప్రభుత్వం విత్తనాలపై సబ్సిడీని తొలగించింది. దీంతో, రైతులు ప్రైవేటు కంపెనీల వద్ద రెట్టింపు ధరలు వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేయాల్సివస్తోంది. అయితే, వ్యవసాయ భూములను సారవంతం చేసేందుకు సేంద్రియ సాగు, భూసారం కాపాడేందుకు రైతులు వినియోగించే పచ్చిరొట్ట (జనుము, జీలుగ, పిల్లి పెసర) విత్తనాలను సబ్సిడీ కింద అందిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేయాలని వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా ప్రభుత్వానికి సూచించినట్లు అధికారులు చెబుతున్నా ఆచరణ రూపం దాల్చలేదు.

గతంలో విత్తన సబ్సిడీ ఇలా..

రాష్ట్రంలో 2020కి ముందు 35 నుంచి 65 శాతం వరకు సబ్సిడీపై విత్తనాలు ఇచ్చేవారు. సోయాబీన్‌కు 37 శాతం, జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలకు 65 శాతం సబ్సిడీ లభించేది. కంది, పెసర, మినుము, వేరుశనగ విత్తనాలపై 35 శాతం వరకూ సబ్సిడీ ఇచ్చేవారు. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలకు తప్ప ఇతర రకాలకు రాయితీ ఇవ్వడం లేదు. కానీ వానాకాలంలో పంటల సాగుకు విత్తనాల కొరత లేకుండా వ్యవసాయ శాఖ జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. నకిలీలను అరికడుతూనే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర



విత్తనాభివృద్ధి సంస్థ పచ్చిరొట్ట, వరి ఇతర రకాల విత్తనాలను ఆగ్రోస్, డీసీఎంఎస్, పీఏసీఎస్, తదితర కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఆ సంస్థ రీజనల్ మేనేజర్ కోటిలింగం తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలు

మొక్కజొన్న	రూ. 571 (5 కిలోలు)
వరి బీపీటీ 5204	రూ. 1,030(25 కిలోలు)
వరి 1010 ఎంటీయూ	రూ.987.50 (25 కిలోలు).
వరి కేఎన్ఎం 1,638	రూ.995 (25 కిలోలు)
వరి ఆర్ఎన్ఆర్ 15,048	రూ.1,110 (25 కిలోలు)
వరి ఆర్ఎన్ఆర్ 29,325	రూ.987 (25 కిలోలు)
వరి జేజీఎల్ 27,356	రూ.987 (25 కిలోలు)
కందులు ఐసీపీఎల్	రూ.599 (4 కిలోలు)
పెసలు ఎంజీజీ-31	రూ. 4,78.9(4 కిలోలు)
వేరుశనగ కే-6	రూ. 3,046.50 (30 కిలోలు)
వేరుశనగ ఖాద్రి లేపాక్షి	రూ. 2,413.75 (25 కిలోలు)
పిల్లిపెసర	రూ.2,710 (20 కిలోలు)
దైంచా టీఎల్	రూ.2,790 (30 కిలోలు)

వీడియో కాల్‌లో అటెండెన్స్..

డుమ్మా డాక్టర్లు, వైద్య సిబ్బందికి చెక్

● దవాఖానాల్లో సమయపాలనపై పర్యవేక్షణ ● ఉదయం, సాయంత్రం హాజరు ● జిల్లా అధికారుల చర్యలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 13 : డాక్టర్లు, సిబ్బంది సమయపాలనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించరని, సమయపాలన పాటించడంలేదన్న ఆరోపణల నేపథ్యంలో చర్యలకుపక్రమించింది. ఈమేరకు ప్రతీ రోజూ వాట్సాప్‌గ్రూప్ వీడియోకాల్ ద్వారా హాజరు పర్యవేక్షణకు చర్యలు చేపట్టింది. ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో సంబంధిత ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, డీఎంహెచ్‌వోతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వోలు కూడా ఉంటారు. ఈ నెల 1వ తేదీ నుంచి నిత్యం ఉదయం 9.30 గంటలకు, తిరిగి సాయంత్రం 4 గంటలకు వీడియోకాల్ ద్వారా అటెండెన్స్ పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీడియోకాల్ చేసిన సమయంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌తో పాటు ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మసిస్ట్, స్టాఫ్‌నర్సు విధుల్లో ఉండాలి. లేకపోతే గైర్హాజరుగా నమోదు చేస్తారు. అయితే డాక్టర్లు, సిబ్బంది సమయపాలనను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ లేదా ఇతర సిబ్బంది సెలవు పెట్టినా ముందస్తుగా సమాచారం ఇవ్వడంతో పాటు ఆరోగ్య శాఖ క్రియేట్ చేసిన వాట్సాప్ గ్రూప్‌లో లీవ్ లెటర్‌ను ముందస్తుగా పంపాల్సి ఉంటుంది. లేకపోతే ఆ రోజు గైర్హాజరు కింద పరిగణిస్తారు. మెడికల్ ఆఫీసర్ సెలవులో ఉంటే ఎంఎల్‌హెచ్‌పీని కనెక్ట్ అవుతారు. అయితే మెడికల్ ఆఫీసర్, సిబ్బంది విధుల హాజరు, గైర్హాజరుకు సంబంధించి నమూనాను రూపొందించిన ఆరోగ్య శాఖ నిత్యం ఉదయం, సాయంత్రం ఆ నమూనాలో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్ వివరాలు నమోదు చేసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి అందజేస్తున్నారు.



సంగారెడ్డి ఇంద్రనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పారదర్శకతకు పెద్దపీట

జిల్లాలోని పలు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో పని చేసే కొందరు మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విధులకు హాజరుకాకున్నా మరుసటి రోజు వచ్చి సంతకాలు చేస్తున్న పరిస్థితి కొన్ని చోట్ల ఉన్నట్లు తెలుస్తున్నది. వీరికి వైద్యాధికారులు సహకరిస్తున్నట్లు కూడా విమర్శలున్నాయి. మరికొందరు హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నుంచి రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించడం లేదనే విమర్శల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తీసుకున్న చర్యలతో రోగులకు సకాలంలో వైద్య సేవలందే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.



దిగ్వాల్‌లో పరిశ్రమ నిర్మాణం గుంతలు తీస్తున్న ఎక్స్‌కవేటర్

ప్రజాభిప్రాయం లేకుండానే

పరిశ్రమ నిర్మాణమా?

గ్రామంలో పరిశ్రమ ఏర్పాటుపై దిగ్వాల్ గ్రామస్థుల అభ్యంతరం

కోహీర్, జూన్ 13 : ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా తమ గ్రామంలో పరిశ్రమ ఏర్పాటు ఎలా చేస్తారని సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. గ్రామస్థులు, అధికారులకు సమాచారం ఇవ్వకుండా పరిశ్రమ నిర్మాణ పనులు కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని 89 సర్వే నంబర్‌లో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం 6 ఎకరాల భూమిని కేటాయించింది. అప్పట్లో భూమిని సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను గ్రామస్థులు నిలదీయడంతో ప్రజాప్రాయం మేరకే పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా పరిశ్రమ నిర్మాణ పనులు ప్రారంభించారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆగమేఘాల మీద సర్వే

స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం టీఎస్ఐఐసీ అప్పగించిన 6 ఎకరాల ప్రభుత్వ భూమిని మండల సర్వేయర్‌తో పాటు డివిజన్ సర్వేయర్ ఆగ మేఘాల మీద సర్వే చేసి సంస్థకి అప్పగించడంపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రైతులు భూ సర్వే కోసం దరఖాస్తు చేస్తే నెలలు గడిచినా స్పందించని రెవెన్యూ అధికారులు పరిశ్రమ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆగ మేఘాల మీద సర్వే చేయడంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక ఏదో మతలబు ఉండే ఉంటుందని అంటున్నారు. సర్వే పూర్తికావడంతో సదరు స్థలంలో భారీ వృక్షాలను నరికేశారు. ప్రభుత్వం ఓవైపు హరితహారంలో మొక్కలు నాటుతూ.. మరోవైపు భారీ చెట్లను నరికి వేయడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అందరి సహకారంతో మెదక్ అభివృద్ధి

- సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా
- రాక్ పాయింట్ ఏర్పాటుకు కృషి
- స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేయాలి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, జూన్ 13: అందరి సహకారంతో మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఎంపీగా గెలిచిన అనంతరం గురువారం తొలిసారి ఆయన మెదక్‌కు వచ్చిన సందర్భంగా బీజేపీ శ్రేణులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఆయన కూచన్‌పల్లి వెంకటేశ్వరాలయం, ముత్తాయికోట శివాలయం, మెదక్ పంచముఖి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి పట్టణంలోని సాయిబాలజీ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం నిర్వహించిన సన్మాన సభలో మాట్లాడుతూ తన గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ జనం గుండెల్లో ఉన్నందునే గెలిచానన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మారుమూల బొప్పాపూర్ గ్రామం నుంచి ఢిల్లీకి ఎంపీగా వెళ్లానని, ప్రజల గొంతుకగా మారి ఇక్కడి సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తానని పేర్కొన్నారు. తాను మాటల మనిషి కాదని, చేతల మనిషినని నిరూపిస్తానని ఆయన స్పష్టం చేశారు. మెదక్‌లో రాక్‌పాయింట్ ఏర్పాటు కృషి చేస్తానన్నారు. అజంతా, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అక్కన్నపేట, చేగుంట స్టేషన్లల్లో నిలిపేందుకు రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలో రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తలు, జిల్లా నాయకులు రఘునందన్ రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు చల్లానరేంద్ర, నర్సింగ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, నియోజకవర్గ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, పరిణీత, వివిధ మోర్చాల అధ్యక్షులు వీణ, సతీష్‌పటేల్, కాశీనాథ్, సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ, మండలాల అధ్యక్షులు ప్రసాద్, ప్రభాకర్, రంజిత్‌రెడ్డి, రాములు, దయాకర్‌రెడ్డి, భానుప్రకాష్, చంద్రశేఖర్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సన్మాన సభలో ప్రసంగిస్తున్న మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

ఓపెన్ స్కూల్ పరీక్ష

ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్, జూన్ 13 : ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో గత ఏప్రిల్, మే నెలలో పబ్లిక్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ పరీక్షల ఫలితాలు గురువారం వెల్లడయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో పదో తరగతి పరీక్షలు 2,181 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా.. 1,736 మంది ఉత్తీర్ణులైనట్టు అధికారులు పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో 458 మంది పరీక్ష రాయగా 357 మంది ఉత్తీర్ణులయ్యారు. సిద్దిపేట జిల్లాలో 769 మంది పరీక్ష రాయగా, 328 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలు సంగారెడ్డి జిల్లాలో 4,022 మంది పరీక్ష రాయగా, 2,696 మంది ఉత్తీర్ణులయ్యారు. మెదక్ జిల్లాలో 881 మంది పరీక్ష రాయగా 530 మంది ఉత్తీర్ణులయ్యారు. సిద్దిపేట జిల్లాలో 1,057 మంది పరీక్ష రాయగా, 393 మంది ఉత్తీర్ణులయ్యారు. అభ్యాసకులు రీకౌంటింగ్ కోసం మీసేవ లేదా టీఎస్ ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 18 నుంచి 27 వరకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తి వివరాలకు కో ఆర్డినేటర్ 8008403635 నంబర్‌లో సంప్రదించవచ్చని డీఈవో పేర్కొన్నారు.

- జిల్లా పాలనలో కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రత్యేక శ్రద్ధ
- ప్రధాన శాఖల్లో ఈ- ఫైలింగ్ విధానం
- టైపిస్టు నుంచి మొదలుకొని కలెక్టర్ వరకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్
- ఇప్పటికే పలుధపాలుగా ఉద్యోగులకు శిక్షణ

ఈ-గవర్నెన్స్‌కు కసరత్తు

మెదక్ కలెక్టరేట్‌లో అమలు చేసేందుకు చర్యలు

మెదక్, జూన్ 13 : మెదక్ జిల్లాలోని ప్రధాన శాఖల్లో కార్యకలాపాల నిర్వహణ ఇకపై ఆన్‌లైన్ విధానంలోనే జరగనుంది. అవినీతికి తావులేకండా పారదర్శకంగా పాలన సాగించేందుకు కలెక్టర్ రాహుల్ రాజ్ నూతన విధానం అమలుకు చర్యలు చేపడుతున్నారు. ఆయన అదిలాబాద్ కలెక్టర్‌గా కొనసాగిన సమయంలో ఆ జిల్లా కలెక్టరేట్‌లో ఈ-గవర్నెన్స్ ద్వారానే పరిపాలన కొనసాగించారు. అక్కడ సత్ఫలితాలు రావడంతో మెదక్ జిల్లాలోనూ అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రెవెన్యూ, విద్య, వైద్య, గ్రామీణాభివృద్ధి, జిల్లా పంచాయతీ, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, స్త్రీ, శిశు సంక్షేమ, జిల్లా పౌర సరఫరాల, ప్రణాళికా, బీసీ, మైనారిటీ సంక్షేమ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల కార్యాలయాల హెచ్‌వోడీలకు సాంకేతిక నిపుణులతో పలు దఫాలుగా శిక్షణ ఇప్పించారు. ఆయా శాఖల అధికారులకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సైతం కేటాయించారు. ఈ-ఫైలింగ్ ద్వారా నిర్వహణ సులభతరంతో పాటు పారదర్శకంగా ఉంటుంది. ఇప్పటికే పలు రాష్ట్రాలలో ఈ- గవర్నెన్స్ విధానం అమలులో ఉంది. ఈ విధానంలో అధికారులు వివిధ ఫైళ్ల స్థితిగతులను ట్రాకింగ్ చేసుకునే వెసులుబాటు లభిస్తుంది. కరోనా సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో కాగితాలు, ఫైళ్లకు బదులుగా ఈ- ఫైలింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. క్రమంగా వైరస్ వ్యాప్తి తగ్గిపోవడంతో తిరిగి యథావిధిగా పాత పద్ధతుల్లోనే కార్యాలయాల నిర్వహణ చేపడుతున్నారు. అప్పట్లో కార్యాలయాలలో సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానం కొరవడడం తదితర పరిణామాలతో జిల్లా కలెక్టరేట్‌లో ఈ-గవర్నెన్స్ విధానం కొనసాగలేదు. అయితే, కాగితపు ఫైళ్లను సురక్షితంగా నిర్వహించడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరంగా మారిందని పలువురు అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

కాగితం రహిత..

ప్రభుత్వ కార్యాలయాలల్లో సేవలు సులభతరం అయ్యేలా ఎన్ఐటీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్) ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ- ఆఫీస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో ఫైళ్లను స్కాన్ చేసి కంప్యూటర్‌లో పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు. అంతకుముందు ఆ ఫైళ్లను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఈ-ఫైలింగ్ విధానంలో ఫైల్ దశలవారీగా ఆయా సెక్షన్‌లకు చేరే వీలుంది. ప్రతీ సెక్షన్ అధికారికి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, డిజిటల్ సంతకం కేటాయిస్తారు. ఇన్‌వార్డు నుంచి మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకూ ఈ-ఫైల్‌ను పరిశీలించేందుకు వీలుగా ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సంబంధిత సెక్షన్ అధికారి పరిశీలన జరిపి ఆయా కార్యాలయాల సూపరిండెంట్‌కు ఆన్‌లైన్ ద్వారా పంపుతారు. ఆయన పరిశీలన జరిపి అదనపు కలెక్టర్ లాగిన్, అక్కడి నుండి కలెక్టర్ లాగిన్‌కు వెళుతుంది. కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. కలెక్టరేట్‌లో అర్జిదారుల దరఖాస్తుల స్వీకరణ నుండి పర్యవేక్షణ ఆన్‌లైన్‌లో నిర్ధారించబడుతుంది.



మెదక్ జిల్లా కలెక్టరేట్ సముదాయం

నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలను నడిపించాలి

● నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, జూన్ 13: నర్సాపూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు అనుగుణంగా నడిపించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేయొద్దన్నారు. అదేవిధంగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ.. అనుభవజ్ఞులైన డ్రైవర్లచేత నడిపించాలని చెప్పారు. సామర్థ్యానికి మించి బస్సులో ఎక్కించొద్దని సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని తెలిపారు.

చుక్క గుర్తు ఓటు వేయండి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, జూన్ 13: చుక్క గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కార్మికులను కోరారు. సంగారెడ్డి పట్టణ శివారులోని పోతిరెడ్డిపల్లిలో గల పెప్రీ పరిశ్రమ వద్ద గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులు సాధించేందుకు సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని, ఎలాంటి సమస్యలు వచ్చినా కార్మికుల పక్షాన నిలబడి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు పాల్గొన్నారు.

కేజీబీవీలో వాచ్‌మన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిన్నశంకరంపేట, జూన్ 13: చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నైట్ వాచ్‌మన్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గీత గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి పాసై ఉండాలన్నారు. అర్హులైన వారు 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కేజీబీలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

16న గజ్వేల్‌లో టీపీటీఎఫ్ విద్యా సదస్సు: అశోక్‌కుమార్

పుల్‌కల్, జూన్ 12: 'విద్యారంగ సంక్షోభం కర్తవ్యాలు-సంక్షోభంలో సామాజిక విలువలు' అనే అంశాలపై 16న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) గజ్వేల్ జోన్ అధ్వర్యంలో విద్యా సదస్సు జరుగనున్నదని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన పుల్కల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యా సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. టీపీటీఎఫ్ బాధ్యతలకు నిలబడి, హక్కుల కోసం కలబడుతుందని, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధితో పాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గాజుల సుభాష్‌బాబు, పుల్కల్, చౌటకూర్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు మన్నె జయకృష్ణ, బైండ్ల రామకృష్ణ, ఎం.శ్రీకాంత్‌గౌడ్, రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అశోక్‌కుమార్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్, జూన్ 13: మెదక్, నర్సాపూర్‌లోని మైనారిటీ గురుకులంలో పలు పోస్టులకు ఔట్ సోర్సింగ్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లానాయక్ పేర్కొన్నారు. నర్సాపూర్ మైనార్టీ గురుకులంలో పీజీటీ ఉర్దూ, ఇంగ్లిష్, సోషల్, ఫిజిక్స్, టీజీటీ ఇంగ్లిష్ పోస్టులకు, అదేవిధంగా మెదక్‌లోని గురుకులంలో పీజీటీ ఫిజికల్ సైన్స్, మ్యాథమేటిక్స్‌లో జూనియర్ లెక్చరర్, సెక్యూరిటీ గార్డు పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు సంగారెడ్డిలోని ఆర్ఎల్‌సీ కార్యాలయంలో ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నర్సరీపై బీజేపీ నేత ప్రతాపం

భూమి డెవలప్‌మెంట్‌కు ఇవ్వలేదని..

- అర్ధరాత్రి అనుచరులతో వీరంగం
- మొక్కలు ధ్వంసం.. స్థలం ఖాళీ చేయాలని బెదిరింపు



దాడిలో ధ్వంసమైన నర్సరీ

పటాన్‌చెరు, జూన్ 13: భూమిని డెవలప్‌మెంట్‌కు ఇవ్వలేదన్న కోపంతో ఓ బీజేపీ యువ నేత నర్సరీలో విధ్వంసం సృష్టించాడు. మొక్కలు ధ్వంసం చేసి, భూమి ఖాళీ చేయాలంటూ తన అనుచరులతో కలిసి బెదిరించాడు. పటాన్‌చెరు పరిధి ముత్తంగి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు బాధితుడి కథనం ప్రకారం.. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ కుమారుడు, బీజేపీ యువనాయకుడు ఆశీష్‌గౌడ్ గ్రామంలోని సర్వేనంబర్ 454లో గడీల శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, సాయికృష్ణ గౌడ్‌లకు చెందిన భూమిని తన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా డెవలప్‌మెంట్‌కు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నాడు. వారు ఇందుకు నిరాకరించారు. అయితే, సదరు భూమిలో కొందరు నర్సరీ ఏర్పాటు చేసుకున్నారు. ఆశీష్‌గౌడ్ బుధవారం రాత్రి తన అనుచరులతో కలిసి ఆ భూమి వద్దకు వచ్చాడు. నర్సరీలోని మొక్కలను ధ్వంసం చేసి, నర్సరీ ఖాళీ చేయాలని బెదిరించాడు. ఈ మేరకు నర్సరీ యాజమాని, భూ యజమానులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేషనల్ మీన్స్ కం మెరిట్‌కు

నస్కల్ విద్యార్థిని సుహాసిని



నిజాంపేట, జూన్ 13: మండల పరిధిలోని నస్కల్ జడ్పీ హెచ్‌ఎస్‌లో చదువుతున్న గుగులోత్ సుహాసిని నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. నగరం తండాకు చెందిన సుహాసిని 2023-24 సంవత్సరానికి గాను ఈ పథకానికి ఎంపికైంది. సుహాసిని జిల్లా నుంచి ఈ పథకానికి మూడో విద్యార్థిని అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తెలిపారు.

శుచి లేదు.. శుభ్రత కానరాదు

- పుట్టగొడుగుల్లా హోటళ్లు, రెస్టారెంట్లు
- టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపుల్లోనూ..
- పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

మెదక్ కల్చరల్, జూన్ 13: మెదక్ పట్టణంలోని నితిన్ అనే వ్యక్తి భార్య టెట్‌లో అర్హత సాధించిన సందర్భంగా సంతోషంతో పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో గల బాలాజీ స్వీట్ హౌస్‌లో మిఠాయిలు కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి తినిపించగా, వెంటనే వాంతులు అయ్యాయి. దీంతో ఆయన మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ తమ సిబ్బందికి తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది స్వీట్ హౌస్‌లో తనిఖీలు నిర్వహించి శుభ్రత, నాణ్యత లేని స్వీట్లను స్వాధీనం చేసుకొని స్వీట్ హౌస్ యాజమానికి రూ. 5 వేల జరిమానా విధించారు. ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదొక్కటే కాదు... జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, స్వీట్ హౌస్‌ల్లో తినుబండారాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. నోరూరించేలా కనిపించే ఈ పదార్థాల తయారీ వెనుక కనీసం శుచి, శుభ్రత ఏ మాత్రం ఉండటం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు, మండల కేంద్రాలలో, జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలలో, ప్రధాన కూడళ్లలో పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, తినుబండారాల దుకాణాలు వెలుస్తున్నాయి. అయితే, వీటిని కనీస నియంత్రణ, పర్యవేక్షణ.. తనిఖీలు లేకపోవడంతో యజమానులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. తాగునీరు, ప్లేట్లు, గ్లాసుల్లో శుభ్రత లేకపోవడం.. ఆహారపదార్థాల్లోనూ నాణ్యత లోపించడం, రుచి కోసం అధిక గాఢతతో కూడిన మసాలాలు, టెస్టింగ్ ఉప్పు, రంగులు వినియోస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ ఆవరణలో అపరిశుభ్రంగా ఉన్న ఫుడ్ సెంటర్

ఎన్నో బ్రాండ్‌ల తాగునీరు...

జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ప్రాంతాల్లో పలు బ్రాండ్ల తాగునీరు విక్రయిస్తున్నారు. లోకల్‌గా కుళాయి నీళ్లను పట్టి, బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నా.. పట్టించుకునే పాపాన పోవడం లేదు. హోటళ్లలో వాడే కూరగాయలు, పండ్లు, మాంసం వంటి వాటి పై శుచి శుభ్రత మాట దేవుడెరుగు అన్న చందంగా ఉంది. పెద్ద హోటళ్ల నుంచి మొదలుకొని చిన్న తిను బండారాల వరకు తనిఖీలు చేయాల్సి ఉన్నా అవి ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు.

మొక్కుబడిగా పర్యవేక్షణ...

పట్టణాల్లో మున్సిపల్ అధికారులతో పాటు ఫుడ్ ఇన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేకపోవడం వినియోగదారులకు శాపంగా మారింది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రోజుల తరబడి నిల్వ ఉంచడంతో పాటు నాణ్యత సరిగా లేనివి శుభ్రత లేని ఆహారం, వస్తువులతో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వీటితో పాటు మాంసాహారాల్లోనూ నాణ్యత ఉండటం లేదు. ఇటు వినియోగారుల నుంచి ఫిర్యాదులు లేకపోవడంతో అధికారులు సైతం స్పందించడం లేదు. పండగలు, ప్రత్యేక దావత్, ఆదివారాల్లో వినియోగం అధికంగా ఉన్నప్పుడు నాణ్యత, శుభ్రత అస్సలు ఉండటం లేదు.



స్వీట్ హౌసను తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్

నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాం

వర్షాకాలం సీజన్ రావడంతో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా గతం కంటే ఎక్కువగా తనిఖీలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. ఇకపై నిరంతరం హోటల్, స్వీట్ హౌస్, టిఫిన్ సెంటర్, ఫాస్ట్ ఫుడ్, పానీపూరి బండ్లు లాంటి వాటిపై తనిఖీలు నిర్వహిస్తాం. యాజమానులు, నిర్వాహకులు శుచి, శుభ్రత, నాణ్యమైన వస్తువులే వాడాలి లేకపోతే చర్యలు తప్పవు. ఆకస్మిక దాడులు నిర్వహించి నాణ్యత శుభ్రత లేకుండా ఉంటే కఠిన చర్యలు తప్పవు.

-మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెదక్ మున్సిపాలిటీ

హత్యాయత్నం కేసులో పలువురి అరెస్ట్

- నిందితుల్లో బీజేపీ నేతలు



వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట క్రైం, జూన్ 13: సిద్దిపేట పట్టణంలో వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో పరారీలో ఉన్న నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిద్దిపేట ఏసీపీ గురువారం వెల్లడించారు. పట్టణంలోని రాఘవేంద్ర నగర్‌లో రాజేష్ అనే వ్యక్తి సర్వే నంబర్ 1999లో ప్లాట్ కొనుగోలు చేసి మున్సిపల్ అధికారుల అనుమతితో ఇల్లు కట్టుకుంటుండగా, పత్రి శ్రీనివాస్, దుది శ్రీకాంత్‌రెడ్డిలు అది తమ భూమి అంటూ ఏవో కాగితాలు చూపిచి, గొడవపడ్డారు. అలాగే, మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు పనులు నిలిపి వేయించగా, రాజేశ్ హైకోర్టుకు వెళ్లి తనకు అనుకూలంగా ఆర్డర్ తెచ్చుకుని, పనులు ప్రారంభించాడు. దీంతో పత్రి శ్రీనివాస్, దుది శ్రీకాంత్‌రెడ్డిలు స్థలం వద్దకు వచ్చి రాజేష్‌ను చంపుతామని బెదరించారు. అయినా, అలాగే నిర్మాణ పనులు చేస్తుండటంతో.. ఆ భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని రాజేష్, అతనికి అండగా ఉన్న సతీష్, శ్రీనివాస్‌రెడ్డిలను చంపాలని నిర్ణయించుకుని సమయం కోసం వేచి చూశారు. ఈ ఏడాది ఏప్రిల్ 19న పత్రి శ్రీనివాసు, దూది శ్రీకాంత్ రెడ్డి, పాతూరు శ్రీనివాస్ రెడ్డి శివరాత్రి నగేష్, చేర్యాల అభిషేక్, అలకుంట ఆనంద్, పరశురాములు, యాదగిరి మొత్తం 11 మంది ప్లాన్ ప్రకారం అర్ధరాత్రి కొంపెల్లి నాగరాజుకు చెందిన ఎక్స్‌కవేటర్ తీసుకువచ్చి.. నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చి వేశారు. సెంట్రింగ్ సామగ్రిని ధ్వంసం చేశారు. అలాగే, అక్కడే ఉన్న రెండు కార్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. దీంతో రాజేశ్ మరుసటి రోజు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలుసుకున్న నిందితులు పారిపోయారు.

ఈ కేసులు నిందితులైన అలకుంట ఆనంద్, వల్లెపు పర్శరాములును ఈనెల 9న, 11న బొల్లవేణి యాదగిరిని అరెస్ట్ చేసి, జైలుకు పంపారు. గురువారం దుది శ్రీకాంత్ రెడ్డి, పత్రి శ్రీనివాస్, పాతూరి శ్రీనివాస్ రెడ్డి, శివరాత్రి నగేష్ చేర్యాల అభిషేక్‌లను అరెస్టు చేసి వారి నుంచి ఓ కారు, ఐదు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన కర్రలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పత్రి నాగరాజు, నాగరాజు, కొంపల్లి నాగరాజు, బోదాసు కనకరాజు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దూది శ్రీకాంత్ రెడ్డి గతంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. గతేడాది సిద్దిపేట బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మరో నిందితుడు పత్రి శ్రీనివాస్ గతంలో సిద్దిపేట బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పని చేశారు.

నియంతృత్వ పాలనతోనే మోదీకి వ్యతిరేక ఫలితాలు

- ప్రజాసమస్యల పరిష్కారంపై రేవంత్ దృష్టి పెట్టాలి
- ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేయాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూన్ 13 : నియంతృత్వ పోకడలు అవలంభించడం వల్లే ఎన్నికల్లో మోదీకి వ్యతిరేక ఫలితాలు వచ్చాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో గురువారం నిర్వహించిన హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేండ్ల మోదీ పాలనలో కార్పొరేట్లకు కొమ్ము కాసి కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మద్దతు లేకపోతే ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉండేది కాదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారని, ఆయన ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. రైతు రుణమాఫీని ఆగస్టు 15లోగా చేయాలన్నారు. భూముల సమస్యల పరిష్కారం కోసం సర్వే నంబర్ల వారీగా సమగ్ర సర్వే చేయాలని సూచించారు. వామపక్షాలకు బలహీన పరిస్థితి వచ్చిందని, ఎందుకు ఆ పరిస్థితి వస్తుందో ఆత్మ పరిశీలన చేసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాగీర్ సత్యనారాయణ, ఎడల వనేష్, నాయకులు కనుకుంట్ల శంకర్, గంబీరపు మధుసూదన్, భాస్కర్, గోపి, పద్మ, సుదర్శన్, జేరిపోతుల జనార్ధన్, జంగ విజయ, మల్లారెడ్డి, సంజీవరెడ్డి తదితరులున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి తప్పించుకోవడానికే హరీశ్ బీజేపీలోకి..

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చక్రధర్ గౌడ్

తార్నాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి తప్పించుకోవడానికి మాజీ మంత్రి హరీశ్‌రావు బీజేపీలో చేరేందుకు యత్నిస్తున్నాడని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చక్రధర్ గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చక్రధర్‌గౌడ్ మాట్లాడుతూ ఆగస్టు 15న రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు తన మాటకు కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా హరీశ్‌రావు ఇప్పటికే బీజేపీ జాతీయ నాయకులతో మంతనాలు జరుపుతున్నాడని, త్వరలో ఆయన బీజేపీలో చేరుతాడని తెలిపారు.

సీఎంకు చిత్రపటం బహూకరణ

నారాయణఖేడ్, జూన్ 13: సిర్గాపూర్ మండలం కడ్పల్‌కు చెందిన బధిర (మూగ, చెవిటి) ఆర్టిస్ట్ గూడురి ఆగమప్ప.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పెన్సిల్‌తో గీసిన చిత్రాన్ని బహూకరించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం కలిసిన గూడురి ఆగమప్ప.. రేవంత్‌రెడ్డి తన మనవడిని ఎత్తుకుని ఉన్నట్లుగా పెన్సిల్‌తో గీసిన చిత్రాన్ని అందించారు. ఆగమప్పకు పుట్టుక నుంచి మూగ, చెవిటి లోపం ఉంది. అయినా చిత్రకళలో ముఖ్యంగా పెన్సిల్ ఆర్ట్‌లో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. పలువురు ప్రముఖుల చిత్రాలను గీసి వారికి అందించారు. తాజాగా సీఎం చిత్రపటాన్ని గీసి బహూకరించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ ఉన్నారు. అయితే, ఆగమప్పకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఎంపీ సురేష్ షెట్కార్ ఈ సందర్భంగా కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పెన్సిల్ ఆర్ట్‌తో వేసిన చిత్రాన్ని బహూకరిస్తున్న చిత్రకారుడు

విద్యార్థులు కష్టపడి చదవాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట, జూన్ 13: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని వీరోజిపల్లి తండా, పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫాంలను కలెక్టర్ అందజేశారు. పెద్ద శంకరంపేట పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా సర్వే చేశామన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్య రంగానికి మొదటి ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 6000 పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్, తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎంపీడీవో రఫీక్‌ఉన్నీసా, ఎంఈవో బుచ్చానాయక్, ఎంపీపీ జంగం శ్రీనివాస్, నోడల్ అధికారి వెంకటేశం, రాజేశ్వర్‌రావు, విఠల్, ఎంపీటీసీలు వీణసుభాష్‌గౌడ్, రాజు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిని మధు, సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, అలుగుల సత్యనారాయణ, ఆర్ఎన్.సంతోష్‌కుమార్, దాచసంగమేశ్వర్, కుంట్ల రాములు, అంజిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పరిశీలన

పెద్దశంకరంపేట, జూన్ 13: పెద్దశంకరంపేటలో మిషన్ భగీరథ సర్వే వివరాలను కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం పరిశీలించారు. ఇంటింటికీ మిషన్‌భగీరథ నీళ్లు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి

మెదక్‌అర్బన్, జూన్ 13: రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటీ టు ఎనిమల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మతపెద్దలతో శాంతి సమావేశాలు నిర్వహించి, జంతు చట్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. జంతువుల నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.వెయ్యి జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష విధిస్తారన్నారు. పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలన్నారు. పోలీస్, వెటర్నరీ, రవాణా శాఖ అధికారులతో జిల్లాలోని తూప్రాన్ టోల్‌గేట్, నర్సాపూర్ చౌరస్తా, కోలపల్లిలో సమీకృత చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ రవాణాను నిరోధించాలన్నారు. పట్టుబడిన పశువులను దగ్గరలోని గోశాలలకు తరలించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి గుర్తించి ముందుగానే బైండోవర్ చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. జిల్లాలో కుక్కలు, కోతుల బెడద నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్‌లో ఎనిమల్ బర్త్ కంట్రోలోను అతి త్వరలో ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా పశువైద్యాధికారి విజయశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయం కోసం ఉపాధ్యాయుడి ధర్నా



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

సిద్దిపేట క్రైం, జూన్ 13 : మరొకరి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో తనకు అన్యాయం జరుగుతోందని ఓ ఉపాధ్యాయుడు సిద్దిపేట పాత డీఈవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మర్కుక్ మండలం పాతూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్టీటీ కూరాకుల శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నాడు. అయితే, ఎస్టీలు కాని వారిని ఎస్టీ జాబితాలో చేర్చి, వారికి ప్రాధాన్యం ఇవ్వడంతో తనకు అన్యాయం జరుగుతుందని అతని వాదన. తాము ఉద్యోగంలో చేరిన సమయంలో పలు కులాలకు చెందిన వారిని ఎస్టీలుగా పరిగణిస్తూ ఉద్యోగాలు ఇచ్చారని, 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఎస్టీ జాబితా నుంచి పలు కులాలను ఎస్సీలుగా మారుస్తూ జీవో నంబర్ 11ను 2014 సెప్టెంబర్ 17న విడుదల చేసిందని గుర్తు చేశారు. అయితే, ఓ ఉపాధ్యాయుడు సదరు జీవోకు అనుగుణంగా తన సర్టిఫికెట్ మార్చుకోకుండా కేవలం ప్రమోషన్ కోసం ఎస్టీలోనే కొనసాగుతున్నాడని ఆరోపించారు. అధికారులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

స్కూల్ యూనిఫాంలను పూర్తిస్థాయిలో అందజేయాలి

● మెదక్ డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్

రేగోడు, జూన్ 13: స్కూల్ యూనిఫామ్‌లను పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరవేయాలని మెదక్ డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం రేగోడు సెర్ప్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలు కుట్టిన స్కూల్ యూనిఫాంలను పరిశీలించారు. మండలంలోని పాఠశాలలకు 2,097 యూనిఫాంలు అవసరం కాగా.. 92 శాతం పూర్తి చేసినట్లు ఏపీఎం సంగీత తెలిపారు. అనంతరం ఉపాధిహామీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి.. మండల జరుగుతున్న ఉపాధిహామీ పనులు, మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జగన్మోహన్, జగదీశ్వర్, టీఏలు శ్రీనివాస్, అశోక్, విజయ్ కుమార్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత ఆలయంలో వార్షికోత్సవం

చేగుంట, జూన్ 13: చేగుంటలోని సంతాన నాగదేవత అలయంలో దశమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం గణపతి పూజ, రక్షాబంధనం, కలశ పూజ, అమ్మవారికి అభిషేకం, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి సంతోష్, చక్రపాణి పాల్గొన్నారు.

నేడు ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాసాయిపేట, జూన్ 13: మాసాయిపేట మండలం కసాన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నదని మాసాయిపేట మండల విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. కసాన్‌పల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని పోతంశెట్టిపల్లి, చెట్లతిమ్మాయిపల్లి, నడిపితండా, పోతనపల్లి వెనుకతండా, పిల్లిగుట్టతండా తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నదని, ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ అధికారులు పనితీరు మార్చుకోవాలి

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
● విద్యుత్ అధికారులతో సమీక్ష

పెద్దశంకరంపేట/నారాయణఖేడ్, జూన్ 13: విద్యుత్‌శాఖ అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. గురువారం పెద్దశంకరంపేటలో నిర్వహించిన విద్యుత్ శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను వారంరోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ డీఈ కృష్ణారావు, ఏడీ మోహన్‌బాబు, ఏవో శ్రీకాంత్, కాంగ్రెస్ మండల నాయకులు రాయిని మధు, నారాగౌడ్, సురేందర్‌రెడ్డి, ఆర్ఎన్ సంతోష్‌కుమార్, సుభాష్‌గౌడ్, సంగమేశ్వర్ పాల్గొన్నారు. వినియోగదారులకు విద్యుత్ సమస్యలు లేకుండా సరఫరా చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం 200ల యూనిట్ల వరకు గృహ అవసరాలకు ఉచిత విద్యుత్‌ను అందించడానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. అందువల్ల కోతలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. సక్రమంగా విధులు నిర్వహించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈ శ్రీనివాస్‌రావు, ఏడీఈ రాఘేంద్రయ్య, ఏఈలు నారాయణ, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకోవాలని బొల్లారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం బొల్లారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు.

●**సంగారెడ్డి రూరల్:** బడిబాట కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు వెంకటేశం, అనురాధ, ఎంపీడీవో యాదగిరి, ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో

వెల్దుర్తి, జూన్ 13: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మనేపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం డిజిటల్ తరగతులను ఎంఈవో యాదగిరితో కలిసి ప్రారంభించారు. అలాగే యశ్వంతరావుపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మన్నెవారి జలాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రం, అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు పోతిరెడ్డి పాల్గొన్నారు.

●**చేగుంట:** చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నోడల్ అధికారి నీరజ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, చల్లా లక్ష్మణ్, వెంకటేష్, చక్రధర్ శర్మ, శారద, రమ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటుబుక్స్ అందజేస్తున్న ఛైర్‌పర్సన్ రోజారాణి, ఉపాధ్యాయులు



ఫసల్‌వాదిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఈవో

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు, ఒకరి మృతి

● మరొకరి పరిస్థితి విషమం

రామాయంపేట, జూన్ 13: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ ఘటన రామాయంపేట మండల పరిధిలోని తొనిగండ్ల గేటు వద్ద గురువారం సాయంత్రం జరిగింది. మెదక్ మండలం శంనాపూర్ ప్రాంతానికి చెందిన చాకలి రాజయ్య(50) టీవీఎస్ ఎక్సెల్‌పై గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మెదక్ నుంచి రామాయంపేట వైపు వస్తున్న కారు ఢీకొనడంతో ఎక్సెల్‌ను ఢీకొనడంతో రాజయ్య అక్కడికక్కడే చనిపోయాడు. వెనక కూర్చున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అతని పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. సమాచారం మేరకు ఎస్ఐ రంజిత్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

అల్లాదుర్గం, జూన్ 13 : గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామానికి చెందిన తమ్మలి ప్రభాకర్(60) బుధవారం ఐబీ వద్ద గల ఓ దాబాలో పనిచేసి రాత్రి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం చిల్వర్ గ్రామ సమీపంలోని 161వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ డివైడర్‌పై విగత జీవిగా పడి ఉన్నాడు. స్థానికులు పరిశీలించగా.. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి భార్య లక్ష్మికి ఫోన్ ద్వారా సమాచారమందించారు. అయితే ఐబీ చౌరస్తా నుంచి కాలినడకన వస్తున్న ప్రభాకర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లు తెలుస్తున్నది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి వివరించారు.



ప్రభాకర్ మృతదేహం

మతిస్థిమితం సరిగ్గాలేక వ్యక్తి ఆత్మహత్య

నారాయణఖేడ్, జూన్ 13: మతి స్థిమితం సరిగ్గా లేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో గురువారం జరిగింది. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన పోచయ్య(38)కు వెంకటాపూర్‌కు చెందిన నిర్మలతో వివాహం జరిగింది. పోచయ్య మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో నిర్మల పిల్లలతో హైదరాబాద్‌కు వెళ్లి.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. కాగా గురువారం వెంకటాపూర్ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యువకుడి అదృశ్యం

సంగారెడ్డి క్రైం, జూన్ 13: సంగారెడ్డి పట్టణంలోని రామచంద్రారెడ్డి కాలనీకి చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ఎన్.భాస్కర్ తెలిపారు. రాంచంద్రారెడ్డి కాలనీకి చెందిన ఎండీ.ముర్తాజ్ ఖాన్(23) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ముర్తాజ్‌ఖాన్ బాబాయ్ వహీద్ ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు లేదా 8712656718 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.



ముర్తాజ్‌ఖాన్ (ఫైల్)

అనుమతులు లేని ప్రచార బోర్డులు తొలగింపు

నారాయణఖేడ్, జూన్ 13: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్ క్రాస్ రోడ్డు నుంచి పట్టణం వరకు ఖేడ్-బీదర్ జాతీయ రహదారి పక్కన అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫాంల్యాండ్స్ వెంచర్లకు సంబంధించిన ప్రచార బోర్డులను మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు సిబ్బంది గురువారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఖేడ్ నియోజకవర్గంలో దాదాపు 76 ఫాంల్యాండ్స్ వెంచర్లు ఉన్నాయి. వాటి ప్రచార బోర్డులను రోడ్ల పక్కన ఏర్పాటు చేయడంతో వాహనాలు నడిపే వారి దృష్టి వాటిపై మళ్లడం, మూల మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు ఈ బోర్డుల వల్ల కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని తొలగించి, వెంచర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం తొలగించారు.



ప్రచార బోర్డులను తొలగిస్తున్న దృశ్యం

ఎరువుల దుకాణాల్లో ఇన్‌చార్జి డీఏవో తనిఖీ

కోహీర్, జూన్ 13: కోహీర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారని ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో జూన్ 12న 'కోహీర్‌లో అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయం' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన వ్యవసాయ అధికారులు కోహీర్ మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అంబికాసోని, మండల ఏవో నవీన్‌కుమార్ మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో టెక్నికల్ ఏడీఏ శ్రీనివాస్‌ప్రసాద్, టెక్నికల్ ఏవో శ్రీకాంత్‌రాహుల్, మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సురేష్‌షెట్కార్‌కు సన్మానం

నారాయణఖేడ్: మహాత్మా బసవేశ్వర జయంతిలో భాగంగా హైదర్‌గూడలోని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో అఖిల భారత మహిళా మండలి ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎంపీగా ఎన్నికైన సురేష్‌షెట్కార్‌ను సన్మానించారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తా: ఎమ్మెల్యే

గుమ్మడిదల, జూన్ 13: ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించి పటాన్‌చెరు నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో హానర్ ల్యాబ్స్ సౌజన్యంతో రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



గుమ్మడిదల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ధాన్యం డబ్బులు ఎప్పుడిస్తారు?

● రెండురోజులన్నారు.. నెలరోజులైంది..!
● అధికారులపై రైతుల ఆగ్రహం

అల్లాదుర్గం, జూన్ 13: ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయిస్తే.. రెండురోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తామని చెప్పారు. కానీ నెలరోజులైనా డబ్బు రాకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో 15 రోజుల క్రితమే కొనుగోళ్లు పూర్తిచేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అల్లాదుర్గం, మండలంలోని కాయిదంపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ధాన్యం విక్రయించి నెలరోజులు కావస్తున్నా.. ఇంతవరకూ డబ్బులు రాకపోవడంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం పలువురు బాధితులు స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్దకు చేరుకొని సంబంధిత అధికారులతో గోడును వెళ్లగక్కుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు తమ వద్ద డబ్బులు లేకపోవడంతో ప్రైవేట్ ఫైనాన్స్‌లో అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. జిల్లా అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



అల్లాదుర్గంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు ఆగం

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, జూన్ 13: కాంగ్రెస్ పాలనలో అన్నదాతల బతుకులు అగమయ్యాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమైనా ఇంతవరకూ ప్రభుత్వం నుంచి రైతు భరోసా సహాయం అందలేదన్నారు. కేసీఆర్ పాలనలో సాగుకు ముందే పెట్టుబడి సాయమందేదని గుర్తుచేశారు. రైతులంటే కాంగ్రెస్‌కు ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. విత్తనాలు, ఎరువులు కొనేందుకు రైతుల వద్ద డబ్బులు లేక వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లి అప్పుచేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు అప్పులపాలు కాకముందే ప్రభుత్వం రైతు భరోసా వారి ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీ



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

రేగోడు జూన్ 13: మండల పరిషత్ కార్యాలయాన్ని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం 11 నుంచి 11:30 వరకు కార్యాలయంలోనే వేచిచూసినా అటెండర్ మినహా ఎవరూ రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రోజూ ఇదేవిధంగా ఉంటుందని మండల కార్యాలయానికి వచ్చిన పలువురు జడ్పీ సీఈవోకు తెలిపారు. అనంతరం రేగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాటపై సమీక్షా సమావేశం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సుశీల, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అంజిబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి: గోవింద్

టేక్మాల్, జూన్ 13: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున గ్రామాల్లోని రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు పొందుతారని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సూచించారు. గురువారం టేక్మాల్ మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్లలో విత్తనాలు కానీ, ఎరువులు కానీ రైతులకు అధిక ధరలకు విక్రయించొద్దన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదును తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.



టేక్మాల్‌లోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

నర్సాపూర్, జూన్ 13: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను.. అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్ యాదవ్ విమర్శించారు. గురువారం నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడునెలలు కావస్తున్నా.. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. ముఖ్యంగా రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు.

జీపీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి: సీఐటీయూ

వెల్దుర్తి, జూన్ 13: గ్రామపంచాయతీ కార్మికులకు నేలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో గ్రామపంచాయతీ కార్మికులతో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నుంచి ఆరునెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయన్నారు. కార్మికులు ఏళ్ల తరబడి పనులు చేస్తున్నా వారికి ఈఎస్ఐ, పీఎఫ్, పర్మినెంట్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు గౌరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నరేందర్, గ్రామపంచాయతీ యూనియన్ మండల నాయకులు మైసయ్య, పెంటయ్య, యాదయ్య, రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశం

'పంచాయతీరాజ్‌శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి'

సంగారెడ్డి రూరల్, జూన్ 13: పంచాయతీరాజ్‌శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యకాంత్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని డీఆర్డీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీరాజ్‌శాఖలో ఖాళీగా ఉన్న ఎంపీడీవో, పర్యవేక్షకులు, సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకుల పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న పర్యవేక్షకులకు గెజిటెడ్ హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు, కార్యనిర్వాహక అధ్యక్షుడు నగేందర్, కోశాధికారి రామలింగం పాల్గొన్నారు.

ఊబచెరువును కాపాడండి

సంగారెడ్డి రూరల్, జూన్ 13: సదాశివపేట పట్టణంలోని ఊబ చెరువు (మినీ ట్యాంక్ బండ్) కట్టను ధ్వంసం చేసి రోడ్డు వేసిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశంకు గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పట్టణ ప్రజలు సాయంత్రం సమయంలో చెరువుకట్టపై సేద తీరుతుంటారని, ప్రజలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడే చెరువు పక్కనే ఉన్న ప్లాట్ల వెంచర్‌కు రోడ్డు లేదన్న అధికారులు.. వెంచర్‌కు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే వెంచర్లకు అనుమతులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం సదాశివపేట ప్రాంత కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల మాత్రలు వేయాలి

మనోహరాబాద్, జూన్ 13: 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగులు మాత్రలు వేయాలని మనోహరాబాద్ మండల వైద్యాధికారి వికాస్ తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మనోహరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 నుంచి 27 వరకు నులి పురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ అనిత, ఆస్పత్రి సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తూప్రాన్ పట్టణంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

తూప్రాన్, జూన్ 13: తూప్రాన్ మున్సిపల్ పరిధిలో జరిగిన పలు కార్యక్రమాలను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, వైస్ ఛైర్మన్ నందాల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. నూతన ట్రాక్టర్, ట్యాంకర్, వినాయక నగర్‌లో హైమాస్టు లైట్లను ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కమిషనర్ ఖాజా మొయినోద్దీన్, కౌన్సిలర్ మామిడి వెంకటేష్, బాణాపురం రాజు, రాముని గారి శ్రీశైలంగౌడ్, కోడిప్యాక నారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆశాలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

సంగారెడ్డి రూరల్, జూన్ 13: రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్లపై కక్షగట్టి పరీక్షా విధానాన్ని తీసుకొచ్చిందని, ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ఆశావర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఆశావర్కర్లకు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆశాలపై అధికారుల వేధింపులు ఆపాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి, మహిపాల్, విద్యాసాగర్, ప్రవీణ్, వరలక్ష్మి, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

బీజీ-2 విత్తనాలకు ఖేడ్ అనుకూలం

నారాయణఖేడ్, జూన్ 13: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని భూములు బీజీ-2 పత్తి విత్తనాలు విత్తుకోవడానికి అనుకూలమని స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చాప్టాకెలో పత్తి విత్తనాలను విత్తడంపై రైతులకు మండల వ్యవసాయాధికారి శంకర్‌తో కలిసి అవగాహన కల్పించారు. అన్ని కంపెనీల బీజీ-2 విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. పత్తి విత్తనాలు విత్తుకునే రైతులు భూమిలో పదును చూసి విత్తుకోవాలన్నారు. విత్తనాలు విత్తిన 48 గంటల్లో కలుపు నివారణ కోసం ఎకరానికి 750 మి.మిల పెండి మిథాలిన్ మందును పిచికారీ చేయాలని సూచించారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీని తెరిపించాలి: సీఐటీయూ

జహీరాబాద్, జూన్ 13: జహీరాబాద్ పట్టణంలో రెండు నెలలుగా మూతపడిన ఈఎస్ఐ డిస్పెన్సరీని వెంటనే తెరిపించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో మూతపడిన ఈఎస్ఐ ఎదుట ఆందోళన చేపట్టి మాట్లాడారు. జహీరాబాద్‌లో పెద్ద మొత్తంలో వివిధరకాల పరిశ్రమలున్నాయని, వేల సంఖ్యలో కార్మికులు ఉన్నారన్నారు. కార్మికుల సౌకర్యార్థం ఈఎస్ఐ డిస్పెన్సరీని తెరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ

● ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్

సంగారెడ్డి రూరల్, జూన్ 13: త్వరలో జరిగే స్థానిక సంస్థలు జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ తెలిపారు. సంగారెడ్డిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ నెల 22న హత్నూర మండలం దౌల్తాబాద్‌లో పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సుమన్, నిజాముద్దీన్, శ్రీనివాస్, పద్మ, వనజ, దేవి తదితరులు పాల్గొన్నారు.